ఫోన్ చెయ్యడం కోసం టెలిఫోన్ బూత్‌కొచ్చింది సుధ. పడమట ఆకాశం ఎ(ర్రగా మెరుస్తోంది. గడ్డి కోసం పొలాలకెళ్ళిన బర్రెలు ఇళ్ళకి తిరిగి వస్తున్నాయి. అవి రేపిన దుమ్ముతో వీధి తెల్లబారింది.

చామనఛాయ, చేప పిల్లల్లాంటి కళ్ళు, సన్నటి చిన్న ముక్కు, సున్నాలా ముద్దొచ్చే పెదాలు, పట్టుకుని సాగదీయాలనిపించే బుగ్గలు, ముడేసిన జుట్టు - చూడ్డానికి అమాయకంగా కన్పించినా తెలివైన పిల్లే. గుండ్రటి భుజాలు, ఆకృతికి తగ్గట్టు నిండుగా వుండే వక్షం - చుడీదార్లో వాటి ఆకృతి తెలుస్తుంటుంది.

టెలిఫోన్ బూత్‌లో కూర్చుని వుండే హరి అంటే సుధకిష్టం. అతడి నవ్వంటే మరీ ఇష్టం. ఆ టైములో హరి హుషారుగా వున్నాడు. సుధ వొస్తుందని ముందే తెలుసునన్నట్టు. హరి మాటలు బాగా చెబుతాడు. జోకులు వేసి నవ్విస్తాడు. ఆ నవ్వేప్పుడు విశాలమయ్యే ఛాతీవంక చూడకుండా వుండలేదు.

అలా అనుకోకూడదు. అతడికి పెళ్ళయ్యింది. పిల్లలున్నారు. కానీ వాళ్ళెవరూ ఇప్పుడతని వద్ద లేరు. భార్య అతన్ని వొదిలిపెట్టి పుట్టింటికి వెళ్ళిపోయింది. ఇప్పటికి ఐదారేళ్ళు ఐపోయి వుంటాయి. వెళ్తా వెళ్తా కొడుకులిద్దర్నీ తనతో తీసుకు



# నీతోడు నేనుంటా

-యజ్ఞమూర్తి బుద్ధి

పోయింది. అప్పట్నించి పాపం హరి వొంటిగా బతుకుతున్నాడు. రక్త మాంసాలు గల వొళ్ళు.. యెట్లా తట్టుకుంటున్నాడో యేమో. ఎప్పుడూ ఈ టెలిఫోన్ బూత్‌లోనే కాలం వెళ్లదీసేస్తుంటాడు.

సుధ పలకరించింది. ''ఏమండీ ఇవాళ సంతోషంగా కన్పిస్తున్నారే. ఏమిటి విశేషం?''

''ప్రత్యేకం ఏం లేదే. ఎప్పట్లానే వున్నా. మీకెందుకు అట్లా అన్పిస్తుందో?''

మనసులో బాధ తెలీకుండా నవ్వుతూ కనపడుతుంటాడు. తనకి తెలీదా? అమ్మ తనకి చెప్పలేదా. ''ఒకసారెళ్ళి అమ్మాయితో మాట్లాడరాదా. వొస్తుందేమో'' అని అమ్మంటే ''ఒకసారేమిటి? ఎన్నిసార్లైనా వెళ్తాను. తను రావాలే కాని. కానీ తను రాదు. నేను తనకి తగనని ఆమె నిశ్చితాభి(ప్రాయం'' అన్నాడంట.

అతనేం చేస్తాడు.. అతని ఆదాయం తక్కువ. తిండికి మాత్రం లోటుండదు. కానీ ఆమెకి కోరికలు జాస్తి. ఆమె అడిగే వస్తువుని అప్పటికప్పుడు తేలేని ఆర్థిక స్థితి అతనిది. టెలిఫోన్ బూత్ మీదయితే ఆమె కోర్కెల్ని తీర్చలేనని చిన్న చిన్న వ్యాపారాలు చేశాడు. కానీ వాటిలో కిటుకులు తెలీల. ఏదీ ఎక్కిరాలేదు. టెలిఫోన్ బూతొక్కటే నిలబడింది. కాపురం చెయ్యలేనని నిర్దయగా పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోయింది. అతడూ పట్టుబట్టలేదు పిల్లల్ని వుంచేయమని. తల్లిలేని పిల్లల్ని తానెట్లా పెంచగలననే భావంతో వూరుకున్నాడు.

సుధ ఫోన్ తీసి నంబరు నొక్కింది. చెవి దగ్గర పెట్టుకుంది. లైను కలవడం లేదు. డిస్‌ప్లేలో నంబరు చూసి ''మీ అక్కయ్య గారికా?'' అడిగాడు.

''అవునండీ. కానీ లైను పోవడం లేదు''

'' ఏదీ ఇటివ్వండి'' అని ఫోన్ తీసుకున్నాడు. ఆమె చేతికి అతడి చెయ్యి తగిలింది. గభాల్న చెయ్యి వెనక్కి లాగేసుకుంది. అతడు పట్టించుకోలేదు. నంబరు నొక్కి అతడూ ప్రయత్నం చేశాడు. ''నిజమేనండి. లైను కలవడం లేదు. ఓ ఐదు నిమిషాలు ఆగండి. లైను క్లియర్ అవ్వొచ్చు'' అన్నాడు.

''ఇరవై నాలుగ్గంటలూ మీరే వుంటారేం. ఎవర్నన్నా పెట్టుకోవచ్చుగా. మీకూ కొంచెం రెస్టు దొరుకుతుందిగా'' అంది స్టూలు మీద సరిగా కూర్చుండడానికి ప్రయత్నిస్తా.

''అమ్మో'' అని కేకతో కిందపడింది సుధ. కాలు పొరపాట్న స్టూలుకి తగిలి బ్యాలెన్స్ తప్పింది. భుజాలు పట్టుకుని ఆమెను లేవదీశాడు హరి. భుజాలు విడిపించుకుని ఈసారి స్టూలు మీద సరిగా కూర్చుంది. సిగ్గుపడింది.

''దెబ్బ తగిలిందా?'' అడిగాడు హరి.

లేదన్నట్టు తలూపింది. కాలు చూసుకుంది. బొటనవేలు చిట్లింది. గోరు కింద నుంచి నెత్తురు కన్పిస్తోంది. గమనించాడు హరి.



**అద్దం పక్కనపెట్టి మంచం మీద వెల్లకిలా పడుకుని మళ్ళీ కళ్ళు మూసుకుంది సుధ. కళ్ళు మూసుకున్నా, తెరుచుకున్నా హరే అవుపిస్తున్నాడు. రెప్పలకింద దాగుడుమూతలు ఆడుతున్నాడు. నరాలు, గుండె, రక్తం, ఒంట్లో ప్రతి అణువు అతన్ని పలవరిస్తున్నాయి.**

''లేదంటారేమిటి? రక్తం కూడా వొస్తుంటేనూ'' అని కుర్చుని ప్యాంటు జేబులోంచి రుమాలు తీసి నెత్తురు సుతిమెత్తగా తుడిచాడు. అక్కడే వున్న కుండలోంచి నీళ్ళు తీసి రుమాలుని తడిపి వేలుని శుభ్రం చేశాడు. ''ఎందుకైనా మంచిది. ఇంటికెళ్ళాక అయోడిన్ వేసుకోండి'' అన్నాడు.

ఫోన్ మళ్ళీ చెయ్యకుండానే ఇంటికి వచ్చేసింది. లోపలికి అడుగుపెట్టబోతుంటే అదే వేలుకి గుమ్మం తగిలి ప్రాణం పోయినంత పనైంది. మళ్ళీ నెత్తురు.

దొడ్లోకి వెళ్ళి వేలిని కడిగి అయోడిన్ వేసి మంచం మీద పడుకుని కళ్ళు మూసుకుంది సుధ. జరిగింది తలుచుకుంటే వింతగా వుంది. హరి తన కాలిని పట్టుకుని వేలిని తుడుస్తుంటే నొప్పి సంగతేమో కానీ ఇంకేదో భావం మనసులోకి వొచ్చింది. లేచి అల్మరాలో వున్న అద్దం తెచ్చుకుని కూర్చుంది. అద్దంలో తన మొహం చూసుకుంది. తనెంత బాగుంది! ఇంటర్మీడియెట్లో వున్నప్పుడు అబ్బాయిలు ఎంతగా తనెంట పడేవాళ్ళో. శివరాత్రి సంబరాల్లో ఆ గుంపులో తనుంటే ఒక పోకిరీ వెధవ తననే వెనక నుంచి ఆనుకుని భుజాల పైనుంచి రెండు చేతులూ వేసి తన రొమ్ముల్ని అదిమాడు. అమ్మ పక్కనే వుంది. చూసింది. వాన్ని పట్టుకుని అక్కడే ఆ చెంపా, ఈ చెంపా వాయించేసింది. వాడెటు పోయాడో మళ్ళీ అవుపించలేదు. ఆ బావొకడు. అక్కమొగుడు. పోయినసారి సంక్రాంతి పండక్కి వచ్చినప్పుడు తను జడ వేసుకుంటుంటే వెనక నుంచి గట్టిగా వాటేసుకుని మెడమీద ముద్దు పెట్టుకున్నాడు. తను అదిరిపడేసరికి ''అయ్యో సుధా నువ్వా. మీ అక్కయ్యనుకున్నా. ఏమనుకోకే'' అన్నాడు. అంతా ఒట్టిదే. కావాలనే చేశాడు. తనకి తెలుసు. అప్పట్నించి ఆ బావ విషయంలో జాగ్రత్తగా వుంటూ వొస్తోంది.

హరి అట్లాంటి వాడు కాదు. ఇందాక తనకి దెబ్బ తగిలినప్పుడు ఏమాత్రం అసభ్యంగా నడచుకోలేదు. ఎంత జాగ్రత్తగా తన కాలుని పట్టుకుని వేలుని శుభ్రంచేశాడు. అదే ఇంకో మగాడైతే అడ్వాన్సు ఐపోయి ఇంకా దూసుకుపోయేవాడు. అతడు తన భుజాలు పట్టుకుని లేవదీసినప్పుడు మాత్రం వేలి నొప్పి వల్ల తనలో వేరే భావం కలగలేదు. అతడి ముఖంలో మాత్రం తనకి దెబ్బ తగిలినందుకు ఆదుర్దా అవుపించింది. అది చాలదా.. అతడు మంచివాడని చెప్పడానికి.

అద్దం పక్కనపెట్టి మంచం మీద వెల్లకిలా పడుకుని మళ్ళీ కళ్ళు మూసుకుంది సుధ. కళ్ళు మూసుకున్నా, తెరుచుకున్నా హరే అవుపిస్తున్నాడు. రెప్పలకింద దాగుడుమూతలు ఆడుతున్నాడు. ఇంతకు ముందు ఇంతిదిగా గుర్తుకు రాలేదు. ఇప్పుడే ఎందుకని? ఆ సంఘటన జరిగినందునా.. నరాలు, గుండె, రక్తం, ఒంట్లో ప్రతి అణువు అతన్ని పలవరిస్తున్నాయి. తను తనేనా.. మరొకరా.. ఆ మరొకరు తనుగా ఐపోయి తన్ను తాను కావలించుకుని.. ఆనందంతో ఏడ్చింది సుధ.

తనని తను స్వాధీనంలోకి తెచ్చుకుంది. శరీరం స్థిమితపడింది. కానీ వేలినొప్పి తెలుస్తోంది. అమ్మెక్కడికి వెళ్ళింది. పక్కింటికెళ్ళిందో, ఎదురింటికెళ్ళిందో. తలుపు దగ్గరకేసి వెళ్లిందంటే అంతే అయ్యుంటుంది.

మంచం మీంచి లేచింది. బయటికి వచ్చి అరుగు మీద కూర్చుంది. అప్పుడప్పుడే చీకట్లు ముసురుకుంటున్నాయి. లేచి బయటి లైటు, ఇంట్లోని లైటూ వేసింది. మళ్లా కూర్చుంటుంటే ఎదురుగా వొస్తూ అవుపించాడు హరి. 'అప్పుడే బూత్ కట్టేయడే. ఎందుకొస్తున్నాడో' అనుకుంది.

హరి వాళ్లింట్లోకి వెళ్లబోతూ ఆమె వంక చూసి ''ఇప్పుడెట్లా వుందండి'' అనడిగాడు.

''నొప్పిగానే వుంది'' చెప్పింది.






''వుండండి. ఇంట్లో నొప్పి తగ్గడానికి టాబ్లెట్లు వుండాలి. తీసుకొస్తాను'' అని ఆమె జవాబు కోసం ఎదురు చూడకుండా వెళ్ళి రెండు నిమిషాల్లో టాబ్లెట్లతో వొచ్చాడు.

''ఇప్పుడు ఇదొకటి వేసుకుని, పొద్దున్నే ఇంకోటి వేసుకోండి. దాంతో నొప్పి పూర్తిగా తగ్గిపోతుంది'' అంటూ ఆమె చేతిలో పెట్టాడు.

ఆమె నవ్వి ''మీరెప్పట్నించి డాక్టరయ్యేరు'' అంది. అతడూ నవ్వి వూరుకున్నాడు.

అతడు నిలబడే వుండేసరికి ''ఎంత సేపు నిలబడతారు..కూర్చోండి'' అని కొంచెం అవతలకి జరిగింది. గజన్నర ఎడంగా అరుగు మీద కూర్చున్నాడు హరి. వెంటనే ఎవరూ మాట్లాడలేదు. ఏం మాట్లాడాలి? అతడి వంక చూసింది. అతడివి చిన్న కళ్ళు. క్రాపింగు ముచ్చటగా వుంది. పెదాలు మాత్రం కొంచెం లావుగా వున్నాయి. మగాడన్నాక అట్లా వుంటేనే బావుంటాయి. మబ్బు రంగు షర్టూ, నల్లఫ్యాంటూ వేసుకున్నాడు. అప్పుడే తలతిప్పి ఆమె వొంక చూశాడు హరి. కళ్ళూ కళ్లూ కలుసుకున్నాయి. ఇద్దరూ ఒక్కసారే కళ్లు కిందికి దించేసుకున్నారు.

'వొస్తాను'' అంటూ లేచాడు హరి.

''ఇప్పుడేగా కూర్చున్నారు. బూత్‌కి వెళ్ళాలా?''

''లేదు. కట్టేసి వొచ్చాను. ఒక గంటయ్యాక వెళ్తాను''

''ఇంకేం.. లోనికెళ్ళి కూర్చుందాం రండి'' అని పిల్చింది. వెళ్ళాడు.

''మీ అమ్మ లేనట్లుందే'' అన్నాడు చుట్టూ చూస్తా.

''బయట ఎవరింట్లోనో వున్నట్లుంది''

''సరే ఐతే వొస్తాను. మీ అమ్మ వుం దేమోనను కుని వొచ్చాను''

''అమ్మ లేకపోతే రాకూడదా?''

'రాకూడదు. ఇప్పుడు బయటి వాళ్ళు ఏదో విషయం మీదే ఇక్కడికి వొచ్చారనుకో. లేనిపోనివి వూహించు కుంటారు. అనవసరంగా నీ కేరెక్టర్ దెబ్బతింటుంది.'

ఒకసారి అతడి మొహం వంక చూసింది. ఈ లోకాన్ని చదివిన అను భవం అతడి మొహంలో బాగా అవు పిస్తోంది. తన యవ్వన రక్తం ఈ భయాన్ని తేలిగ్గా కొట్టేయవచ్చు. అది కాదు. అమ్మ లేదంటే వెళ్ళిపోతానన్న అతని సంస్కారం ఎంత గొప్పది?

ఇట్లాంటి వాణ్ణి కాదనుకుని వెళ్ళిపోయిన అతని భార్య ఎంత అదృష్టహీనురాలు.

అతని తల లాక్కుని, తన వక్షానికి అదుముకుని ''మీకు నేనున్నాను. మీరు నాక్కావాలి'' అని చెప్పాలన్పిం చింది.

''నా కేరక్టర్ గురించి మీకెందుకు బెంగ. జనం అనుకునే మాటల్ని నేను లెక్క చేయను'' అంది దర్పంగా.

నవ్వాడు హరి. సంభాషణ ఎటో వెళ్తోంది. అసలు తనిప్పుడు ఇట్లా రావడమే తప్పు. ఆమె జుట్టు ముడి విప్పదీసి సరిచేసుకుంటోంది.

''సుధా. మీకు నేను చెప్పలేను. నేను గొప్ప ధైర్యవంతుణ్ణికాను. నా మూలంగా మీకు అపకీర్తి వొస్తే అది తట్టుకునే మనస్తత్వం లేదు నాకు'' అని లేచాడు.

''నన్నొక్కదాన్నే వొదిలేసి వెళ్తారా?''

''అదేమిటి? మీకేమిటి భయం. మీ అమ్మ వొచ్చేస్తుందిగా. ఇంతలోకి ఏమవుతుంది?''

''ఏమో. అమ్మ వొచ్చేలోగా ఎవడైనా దుర్మార్గుడు వొస్తే''.

''ఏమిటీ అర్థం లేని మాటలు. ఎవడొస్తాడు?''

''ఇంతకు ముందు మీరూ అనలేదా. ఎవరైనా వొస్తే నా కేరక్టర్‌కి దెబ్బ అని''

''అదీ ఇదీ ఒకటి కాదు''

''ఏమో కాకపోవచ్చు. ఐనా మీ భయం కూడా అర్థం లేనిదే''

అతను తల మరోవేపు తిప్పుకు న్నాడు. 'ఈ పిల్ల ఇట్లా మాట్లాడు తుందేమిటి? ''ఇటు చూడండి'' అంది సుధ.

చూశాడు. ''మీరంటే నాకు ప్రేమ'' అని అతడి ముందుకెళ్ళింది.

''మీకు పిచ్చా'' అన్నాడు ఆశ్చర్యపడుతూ.

''ఏమైనా అనుకోండి. మీరంటే ప్రేమ అంతే''

''నాకు పెళ్ళయి, పిల్లలు కూడా వున్నారు''

''ఏరీ? ఎక్కడ?''

''ఇక్కడ లేకపోతేయేం. ఆమె తన పుట్టింట్లో వుంది''

''అది నాకూ తెలుసు. ఎందుకెళ్ళిపోయిందో కూడా తెలుసు. ఆమెకి మీరు అక్కర్లేదు. మీరు లేకపోయినా ఆమెకి పిల్లలున్నారు. మరి మీకూ.. మీ జీవితానికి అర్థం ఏమిటి?''

''నా రాత ఎట్లా వుంటే అట్లా జరుగుద్ది''

''మీ రాతలో నాకూ స్థానముందని చెబుతున్నా''

అంతలో తలుపు వద్ద చప్పుడ య్యింది. ఆమెకి ఎడంగా జరిగాడు హరి.

సుధ తల్లి రాధమ్మ!

అతను పలకరింపుగా నవ్వాడు. వెళ్లాలా,వొద్దా అని సందేహిస్తున్నా డు.

''సుధ అడిగిన దానికి జవాబు చెప్పవేమయ్యా'' అడిగింది రాధమ్మ. తత్తరపడి ఆమె వొంక చూసి ''ఏమంటున్నారు మీరు?'' అన్నాడు.

''అవును హరీ. నేనంతా విన్నా. సుధ మనసులో ఇట్లాంటి భావం వుందని నాకూ ఇప్పుడే తెలిసింది. అది సరైన పనే చేసింది. నీ గురించి నాకూ తెలుసు. నీ భార్యే నిన్నర్థం చేసుకోలేక వెళ్ళి పోయింది. నీ జీవితాన్ని ఎందుకిట్లా నాశనం చేసు కుంటావ్. నా మాట విను. మీ పెళ్లి నేను జరిపిస్తా''

''కానీ మేమింకా లోకం దృష్టిలో భార్యాభర్తలమే కదా''

''ఐదేళ్ల నుంచీ నీకు దూరంగా వుంటున్నది కదా. విడాకులు తెప్పిం చుకోడం కష్టం కాదు కదా''

రాధమ్మ వొంక కృతజ్ఞతగా చూశాడు హరి. హాయిగా నవ్వింది సుధ.



## మురళీరవళి

మెరిసే... గగనాన మెరుపే..
విరిసే... హృదయాన వలపే..
మురిసే... నామూగ మనసే..
తెలిసే... తొలిప్రేమ సొగసే..

హృదయం.. అమృతకలశమే..
నీ నయనం.. మన్మథబాణమే..
ఆ గోపాలుని రాధలాగా
మురిపించే మైమరపించే...
మ్రోగే.. మోహన మురళీ..
సాగే... మంజుల రవళీ...

పాడే పాటల పల్లవి నీవే...
రాసే కవితల వెల్లువ నీవే..
ప్రతి కళలోనూ నీరూపే..
కనిపించే నను మురిపించే
వినవే... కోయిలగానం
పాడే.. జీవనరాగం...

- శ్రీకావ్య

## విధి

మే 7, 2002న రిచర్డ్ గోల్డ్‌బెర్గ్ అనే పెరోల్ పోలీస్ ఆఫీసర్ 'సిన్సినాటిరెడ్స్' అనే టీం ఆడే బేస్‌బాల్ ఆటకి వెళ్ళాడు. స్కోర్‌బోర్డ్ మీద 'కిస్‌కీమ్' అనే కెమెరాతో ముద్దు పెట్టుకునే జంటలని చిత్రీకరించి ప్రదర్శించడం అక్కడ ఆనవాయితీ. డేవిడ్ హర్టన్ (24) అనే అతను తన గర్ల్ ఫ్రెండ్‌ని ముద్దుపెట్టుకుంటుండగా చిత్రీకరించి, స్క్రీన్ మీద కొద్ది క్షణాలు ప్రదర్శించారు. అతను 4 ఏళ్ళ జైలుశిక్ష అనుభవిస్తూ రెండేళ్ళ శిక్ష అనుభవించాక పెరోల్ మీద బయటికి వచ్చి తిరిగి జైలుకి రాలేదు. అతని కోసం వెతుకుతున్న రిచర్డ్ వెంటనే అతన్ని కనిపెట్టి అరెస్ట్ చేశాడు. 30,000 మంది ప్రేక్షకుల్లో ఆ దొంగే 'కిస్‌కేమ్'కి చిక్కడం, పోలీస్ ఆఫీసర్ అతన్ని గుర్తుపట్టడం విధి కాక మరేమిటి?